క్లుప్తంగా

జేసీఎస్ కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యం


కె.సుబ్రహ్మణ్యం

గజపతినగరం: మండల జేసీఎస్ (జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు) కన్వీనర్‌గా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కనకల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు శుక్రవారం కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అధిష్టానం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న బాలకృష్ణరావు దంపతులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన ఇ.బాలకృష్ణారావు, సుధారాణి దంపతులు రూ.1,00,116 ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, దాసరి రవి, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబుకు అందజేశారు.

మిగులు ధాన్యం కొనుగోలుకు చర్యలు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి

గంట్యాడ: జిల్లాలో రైతుల వద్ద ఉన్న మిగులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా త్వరలో కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి పేర్కొన్నారు. మండలంలోని రావివలస వ్యవసాయ సలహా మండలి సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈ–క్రాప్‌ను రైతులు త్వరగా చేయించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పులు లేకుండా రైతుల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రకాష్, ఏఓ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

68 మందికి వైద్య సేవలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కుమరాం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొండపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 68 మంది రోగులకు వైద్యాధికారులు చైతన్యకుమార్, జగదీశ్వరరావు వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి మందులు ఉచితంగా అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

మెట్టపల్లిలో గ్రౌండ్ ట్రూతింగ్


సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.సురేష్

చీపురుపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. మండలంలోని మెట్టపల్లి గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూముల సమగ్ర రీసర్వే చేపట్టిందన్నారు. సర్వే సమయంలో రైతులు దగ్గరుండి తమ పొలానికి సంబంధించిన సరిహద్దులను సర్వే సిబ్బందికి చూపించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన

వేపాడ: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పంచాయతీ విస్తరణ అధికారి సూర్యనారాయణ అన్నారు. ముకుందాపురంలో సర్పంచ్ నాగిరెడ్డి కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలోని తడి, పొడి చెత్తను ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని కోరారు. ఇంటిపన్ను వసూలుపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి పద్మకు సూచించారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ వివరించండి
- పార్టీకి, ప్రజలకు మధ్య వారధులు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వేదికపై ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

గజపతినగరం: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతీ ఇంటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి టీడీపీ తన అనుకూల మీడియా ద్వారా ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. వారి దుష్ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించాలని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశాం కాబట్టే ఈ రోజు ప్రజల మధ్యకు వెళ్లి ధైర్యంగా చెప్పుకోగలుగుతున్నామన్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు లంచాలు లేనిదే ఏ పని జరిగేది కాదని, దోచుకోవడం.. దాచుకోవడం తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా వారి హయాంలో చేపట్టలేదని ఆరోపించారు. కుల వృత్తుల వారికి ఇస్త్రీపెట్టి, గొర్రెపిల్లలు ఇచ్చి తామే బీసీలకు అభివృద్ధి చేశామని చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అభివృద్ధి అంటే ఎంటో.. ఎలా ఉంటుందో జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు మెటీరియల్‌తో పాటు పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించడంతో పాటు వారితో ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణ మూర్తిరాజు(గంట్యాడ), జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, గజపతినగరం జేసీఎస్ మండల కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, పల్లి సంజీవరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


సీఎం సందేశంతో కూడిన సంక్షేమ లబ్ధి పత్రాన్ని మహిళకు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండలం బొండపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో గ్రామంలోని పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.8.70 కోట్లు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామంలో 60 మంది నిరుపేదలకు గృహాలు మంజూరు చేశామని, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నామని అన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశామని, ఇంకా నిధులు అవసరమైతే జెడ్పీ నిధులు మంజూరు చేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకతకు పెట్టపీట వేస్తూ.. అవినీతి రహిత పాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఉగాది నాటికి విశాఖపట్నం పరిపాలన రాజధానిగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాజధాని ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రజా సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పచ్చమీడియాతో ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, స్థానిక సర్పంచ్ సాకేటి స్వప్న, ఎంపీటీసీ రాములప్పమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, లెంక శ్రీరాములు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి


జామి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వేదికపై ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

జామి: దేశం మొత్తం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన వైపు చూస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన జామిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి అవినీతి రహితపాలన అందిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. దేశం మొత్తం జగనన్న పాలనను అభినందిస్తుంటే రాష్ట్రంలో కొన్ని పత్రికలు, చానళ్లు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టడంతో పాటు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని, అభివృద్ధిని ప్రతీ గడపకు తీసుకువెళ్లాలని పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు సూచించారు. సమన్వయంతో పనిచేసి మరోసారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గృహసారథులు, కన్వీనర్లు జగనన్న సైన్యమని అన్నారు. లోకేష్‌కు లోక జ్ఞానం లేదని, పవన్‌కల్యాణ్‌కు పవర్ లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎస్.కోట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌మోహన్ రెడ్డి గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే సీఎం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ దిశగానే పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, పార్టీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, జామి మేజర్ పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ


మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: మునగ ఆకుల్లో కాల్షియం, ఐరన్ మూలకాలు పుష్కలంగా ఉంటాయని, వాటిని ప్రతిరోజు ఆహారంలో తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించొచ్చని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు శుక్రవారం మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మునగ ఆకులను ఆహారంగా తీసుకోవడం ద్వారా కంటి చూపు మెరుగుపడుతుందని, ఎముకలు దృఢంగా మారుతాయని, రక్తకణాలు వృద్ధి చెందుతాయని అన్నారు. బీపీ, షుగర్ వ్యాధులు నియంత్రణలో ఉంచేందుకు మునగ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వెలుగు ఏపీఎంలు శ్రీనివాస్, శైలేష్, సీసీ చినబాబు పాల్గొన్నారు.

పెరటి మొక్కల పంపిణీ

చీపురుపల్లి: పెరటి మొక్కల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి అన్నారు. ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటిమొక్కలు పంపిణీ చేశారు. ఇంటి అవసరాలకు కావాల్సిన కూరగాయలను పెరట్లో పండించుకోవడం ద్వారా డబ్బు ఆదా అవుతుందన్నారు. పెరటి మొక్కల సాగును ప్రోత్సహించేందుకు ఉచితంగా మొక్కలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇప్పిలి సుధారాణి, ముల్లు పైడిరాజు, మహంతి ఉమ తదితరులు పాల్గొన్నారు.

వ్యాకులమాత జాతరకు భారీ బందోబస్తు

కొత్తవలస: ఈ నెల 5న జరిగే వ్యాకులమాత జాతర సజావుగా సాగేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు జాతరకు వచ్చే అవకాశం ఉందన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముగ్గురు సీఐలు, 12 మంది ఎస్సైలు, 34 మంది ఏఎస్సైలు, 280 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి వెళ్లేందుకు కొత్తవలస జంక్షన్ వద్ద అండర్‌బ్రిడ్జి క్రింద నుంచి ద్విచక్ర వాహనాలను అనుమతిస్తున్నట్లు చెప్పారు. తిరుగు ప్రయాణంలో వాహనదారులు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డు హైవే మీదగా నరపాం జంక్షన్, కొత్తవలస మీదగా రావాల్సి ఉటుందన్నారు. యాత్రకు వెళ్లే భక్తుల కోసం 30 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండూ కళ్లుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ ఎగువ ఎర్రవానిపాలెంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హతే ప్రమాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు మేలాస్త్రి అప్పారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య, రామస్వామి, నాయకులు పీఎస్ఎన్ పాత్రుడు, దమ్ము రమణ, జామి సాల్మన్‌రాజు, పి.రామకృష్ణ, లెంక సూరిబాబు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సంక్షేమ పాలనకు ప్రజల మద్దతు


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనకు ప్రజల మద్దతు పూర్తి స్థాయిలో ఉందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. చీపురుపల్లిలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా సంక్షేమ పరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తోందని, ఆయా పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను నియమించినట్లు చెప్పారు. మండలంలో నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతున్నందున పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. బెల్లాన వంశీకృష్ణ, కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, ఇప్పిలి తిరుమల, కోరుకొండ దాలయ్య, ముల్లు పైడిరాజు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


మట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళుతూ గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చొరవ చుపాలని ఎంపీపీ చల్ల చలంనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చేసిన తీర్మానాల అమలు, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. మండలంలోని చాలా గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉందని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా.. త్వరలోనే అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈఈ శంకరరావు సమాధానమిచ్చారు. ఈ–క్రాప్‌లో నమోదైన ప్రతీ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు అధికారులను కోరారు. పశువైద్యశాఖపై జరిగిన చర్చలో పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆవులు, గేదెలకు ఆడదూడలు పుట్టేలా కొత్తగా క్రాస్‌బ్రీడ్ ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయని, రూ.1250లు ఉన్న ఈ ఇంజెక్షన్‌ను పాడిరైతులకు రూ.250లకు అందిస్తున్నట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈఈ రమణరాజు మాట్లాడుతూ.. జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు సిమెంట్, ఇసుకను రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, సివిల్ సప్లయ్ డీటీ రవిశంకర్, వ్యవసాయాధికారి మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందచేత


బొండపల్లి: కేజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీర్ ఉమ


వేపాడ: తగరపువలసలోని ఆస్పత్రికి వెళ్లి పింఛను అందచేస్తున్న వలంటీరు శివ

బొండపల్లి/వేపాడ: మండలంలోని గొట్లాం గ్రామానికి చెందిన కొమ్మాన రమణమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు వృద్ధాప్య పింఛను వస్తుండడంతో వలంటీర్ తాళ్లపూడి ఉమ శుక్రవారం విశాఖపట్నం వెళ్లి పింఛను అందజేశారు. వేపాడ మండలం జాకేరుకు చెందిన వృద్ధాప్య పింఛను లబ్ధిదారు బుద్దా అప్పాయమ్మ అనారోగ్యంతో తగరపువలసలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ గనివాడ శివ ఆస్పత్రికి వెళ్లి పింఛను డబ్బులు అందజేశాడు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

శృంగవరపుకోట: ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఆహార పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వారిపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఫుడ్ కమిషన్ మెంబర్ జి.కాంతారావు అన్నారు. ఎస్.కోట పట్టణంలోని రేషన్ డిపోలను, ఎంఎల్ఎస్ పాయింట్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను పరిశీలించారు. స్థానిక గాంధీనగర్, శ్రీనివాస కాలనీల్లో రేషన్ దుకాణాలను, అంగన్‌వాడీ–1,2 కేంద్రాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ఆహార పంపిణీలో మరింత శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఏఎస్ఓ అశోక్, డిప్యూటీ విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, మిడ్ డే మీల్ కోఆర్డినేటర్ సత్యం, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ కావ్యరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవి ఉన్నారు.

సంక్షిప్తంగా...

పేకాట స్థావరంపై దాడి

కొత్తవలస రూరల్: కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ బాల సూర్యారావు తెలిపారు. వారి వద్ద రూ.13,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ద్విచక్ర వాహనాల వేలం రేపు

దత్తిరాజేరు: వివిధ కేసుల్లో సీజ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను ఈ నెల 5న వేలం వేయనున్నట్లు పెదమానాపురం, ఎస్.భూర్జవలస ఎస్సైలు బి.భాగ్యం, రాజేష్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని వాహనాలను దక్కించుకోవాలని కోరారు.


40 మంది ఉద్యోగాలకు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో పలువురు యువకులు ఉద్యోగాలు సాధించినట్టు విద్యాసంస్థ అధినేత సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఇంటర్వ్యూలకు 100 మంది యువతీ యువకులు హాజరు కాగా 40 మంది క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్ విభాగాల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

భాషా నైపుణ్యాల పెంపునకు 'లిప్'

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కేజీబీవీలో నిర్వహిస్తున్న ఎల్.ఐ.పి(లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)ను పాఠశాల స్థాయి పరిశీలకుడు పి.బాలభాస్కర్, సీహెచ్ కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంచేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అక్కడి ఉపాధ్యాయులకు బోధనకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో ప్రావీణ్యం పొందేందుకు ఈ ప్రోగ్రాం దోహదపడుతుందన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ


విగ్రహాలకు అభిషేకాలకు చేస్తున్న భక్తులు

గుర్ల: మండలంలోని పెనుబర్తిలో రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడు, శివ పార్వతులు, సీతరాముల విగ్రహాలకు భక్తులు క్షీరాభిషేకం చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు చేపట్టనున్నట్లు సర్పంచ్ తుమ్మగంటి మాధవి, వైస్ ఎంపీపీ అంబల్ల లక్ష్మి తెలిపారు.

ఊటపల్లి ఉపసర్పంచ్‌గా అప్పలరాము

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి, శ్యామాయవలస పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. ఊటపల్లిలో 10వ వార్డు మెంబరు గేదెల అప్పలరామును సర్పంచ్ సంగంరెడ్డి వెంకటలక్ష్మితో పాటు వార్డు మెంబర్లు ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి హరికృష్ణ అప్పలరాముకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. శ్యామాయవలసలో కోరం లేక ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి వెంకటరమణ ప్రకటించారు.

బంగారం చోరీపై విచారణ

దత్తిరాజేరు: మండలంలో జగన్నాథపురం గ్రామానికి చెందిన రెడ్డి చిన్నంనాయుడు తన ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన 12 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై రాజేష్ శుక్రవారం గ్రామానికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానితులను స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు.

వలస కార్మికులకు వైద్యసేవలు


వైద్యసేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ సమీపంలో నర్సిపల్లి మెట్ట వద్ద నివసిస్తున్న వలస కార్మికులకు బొద్దాం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం వైద్యసేవలు అందించారు. ఏఎన్ఎం స్వప్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు కార్మికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. అలాగే వావిలపాడులో వేపాడ పీహెచ్‌సీ సిబ్బంది, జాకేరులో బొద్దాం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించారు.

దోమల నివారణకు ఫాగింగ్

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఎంపీ బెల్లన చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ అధికారి ఝాన్సి తెలిపారు. స్థానిక రుంకానవీధి, బెల్లానవీధి, చిలుకురివీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

శివరాత్రి జాతరకు పుణ్యగిరి సిద్ధం

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన పుణ్యగిరి శివరాత్రి జాతరకు సిద్ధమవుతోంది. ఈనెల 5న ఆదివారం పుణ్యగిరిలో ఉమాకోటిలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన చేయనున్నట్టు దేవస్థానం చైర్మన్ పి.రామకృష్ణ చెప్పారు. ఆదివారం ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం, 7గంటలకు లక్ష బిల్వార్చన, 10గంటలకు తిరుకల్యాణం, 12గంటలకు అన్నసమారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీయాలి


మాట్లాడుతున్న అగ్నిహోత్ర శర్మ

గంట్యాడ: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ) జోనల్ మేనేజర్ అగ్నిహోత్ర శర్మ అన్నారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో ఈఎండీపీపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మకత, సాంకేతికత పరిజ్ఞానం మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎండీపీ జిల్లా మేనేజర్ సురేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.